సాక్షి
శ్రీకాకుళం

గురువారం । 29 । జూన్ । 2023



పట్టపగలే దొంగలు పడ్డారు

ఫరీదుపేట కూడలిలో దొంగతనం జరిగింది. పట్టపగలే 13 తులాల బంగారం, రూ. 1.60 లక్షల నగదును అపహరించారు. - 8లో



స్టీరింగ్ పట్టు..ఉపాధి కొట్టు..

నిరుద్యోగ యువతకు ఏపీఎస్ ఆర్టీసీ అండగా ఉంటోంది. డ్రైవింగ్‌లో శిక్షణ ఇస్తోంది. ఇప్పటికే 12 బ్యాచ్‌లు పూర్తయ్యాయి. - 8లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్టం	కనిష్టం
ఆమదాలవలస	34°	25°
ఇచ్ఛాపురం	35°	24°
పాతపట్నం	34°	26°
శ్రీకాకుళం	35°	26°

న్యూస్‌రీల్

ముస్లింలకు బక్రీద్ తోఫా పంపిణీ



తోఫా అందిస్తున్న ముస్లిం పెద్దలు

శ్రీకాకుళం కల్చరల్ : బక్రీద్ సందర్భంగా శ్రీకాకుళం జామియా మసీదులో బుధవారం పేద ముస్లింలకు తోఫా పంపిణీ చేశారు. కమిటీ సభ్యులు, జాఫర్ బాయ్, జిలానీ ఖాన్, ఇతరుల ఆర్థిక సహకారంతో 150 మందికి బియ్యం, గోధుమపిండి, వంటనూనె ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు హాజి అమిరుల్లా బేగ్, ఇన్‌స్పెక్టర్ సాజిద్, రియాజ్, జామియా మసీదు అధ్యక్షుడు మహిబుల్లా ఖాన్, ఉపాధ్యక్షుడు భయ్యా సేట్, సెక్రటరీ బాషా, జాయింట్ సెక్రటరీ షుకుర్‌ఖాన్, ట్రెజరర్ ఉస్మాన్ పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన



శివసాగర్ బీచ్‌లో స్థల పరిశీలన చేస్తున్న జేసీ నవీన్

వజ్రపుకొత్తూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం తీర ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి శివసాగర్ బీచ్‌లో పర్యాటక కేంద్రం ఏర్పాటుకు బుధవారం జాయింట్ కలెక్టర్ నవీన్ స్థల పరిశీలన చేశారు. సుమారు ఐదు ఎకరాల స్థలం అవసరం కావడంతో రెవెన్యూ భూములు, సీఆర్‌జెడ్ పరిధి, తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు తహశీల్దార్ బి.అప్పలస్వామి, ఆర్‌ఐ పవిత్ర, వీఆర్‌ఓలు ఇందిరాప్రియదర్శిని, వెంకటరావు, మాజీ సర్పంచ్‌లు లండ రామలింగం, రమేష్, సర్వేయర్ పాల్గొన్నారు.

1న ఐటీఐ అప్రెంటీస్ మేళా

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం (ఐటీఐ)లో జూలై 1న అప్రెంటీస్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్‌రావు బుధవారం తెలిపారు. అరబిందో ఫార్మా లిమిటెడ్, ఆంధ్రా ఆర్గానిక్స్, నాగావళి సాల్వెంట్స్ పరిశ్రమల్లో శిక్షణ ఇప్పించేందుకు 47 మందిని ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఐటీఐ పూర్తిచేసిన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డిసెంబర్ నాటికి వంశధార రిజర్వాయర్ పూర్తి



వంశధార రిజర్వాయర్ పనులు పరిశీలిస్తున్న సీఈ సుగుణాకర్

హిరమండలం: వంశధార రిజర్వాయర్ నిర్మాణ పనులు డిసెంబర్ నెలాఖరులోగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల చీఫ్ ఇంజినీర్ ఎస్.సుగుణాకర్ తెలిపారు. బుధవారం హిరమండలంలో వంశధార రిజర్వాయర్ పనులతో పాటు ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించారు. అనంతరం వంశధార అతిథి గృహంలో ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్ట్ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం రిజర్వాయర్ పనులు 95 శాతం పూర్తయినట్లు తెలిపారు.రూ.175 కోట్లతో ఎత్తిపోతల పనులు అక్టోబర్ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని పనులను డిసెంబర్ నాటికి పూర్తి చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి సిద్ధం చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కుడి కాలువ కంటే ఎడమ కాలువ పనులకు ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో రూ.299 కోట్లతో మహేంద్రతనయ, ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు జరుగుతున్నాయని వివరించారు. వంశధార నది గొట్టా బ్యారేజీ షట్టర్లు కుంభకోణంపై సీఐడీ దర్యాప్తు జరుగుతోందన్నారు. సుమారు ఆరు వేల మంది దిగువ స్థాయి సిబ్బందిని కాంట్రాక్టు పద్ధతిలో నియమించేందుకు ప్రతిపాదనలు పంపించామన్నారు. వంశధార ఎస్ఈ డోల తిరుమలరావు మాట్లాడుతూ వంశధార కుడి గట్టు పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వంశధార నిర్వాసితుల అదనపు పరిహారాన్ని త్వరలోనే చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్‌సీ స్వర్ణకుమార్, వంశధార కట్టడాల విభాగం ఈఈ ఎస్.వి.రమణ, డీఈలు ఎం.వి.సురేష్, రవికాంత్, రవీంద్రనాయుడు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సాయం సంధ్య వేళ.. అంతవరకు ఇళ్లలోనూ, ఉద్యోగ వ్యాపకాలతో బిజీగా గడిపిన ప్రజలు కాస్త కులాసాగా గడిపేందుకు నగర వీధుల్లోకి రాగానే ఘుమఘుమలాడుతూ.. చవులూరించే పరిమళాలు ఆకర్షిస్తుంటాయి. రా.. రమ్మని ఆహ్వానిస్తుంటాయి. శ్రీకాకుళం నగరంలోని ప్రధాన కూడళ్లలో కొలువుదీరే వాహనాలే ఈ ఘుమఘుమలకు కేంద్రాలు. శుచికి, శుభ్రతకు ప్రతీకలుగా నిలిచే ఈ వాహనాలు సంచార తినుబండారాల నిలయాలు. పూర్ణం బూరెలు వంటి సంప్రదాయ పిండి వంటలతో పాటు.. మష్రూమ్ రైస్, ఫ్రైడ్ రైస్ వంటి ఆధునిక ఆహార పదార్థాలతో కనువిందు చేస్తుంటాయి. చిత్రం ఏమిటంటే.. నగరంలో ఉన్న ఈ తరహా సంచార విక్రయశాలలన్నింటిలోనూ ఒకే రకమైన పదార్థాలు లభిస్తాయి. నగరంలో మూడుచోట్ల ఉన్న వంటశాలల్లో ఆహార పదార్థాలు తయారు చేసి.. బ్యాటరీ వాహనాల్లో సర్ది రద్దీ కూడళ్లకు తరలించి సరసమైన ధరలకు విక్రయిస్తారు. ఈ ఆహార వ్యాపారం ద్వారా వందల మంది ఉపాధి పొందుతున్నారు.

ఆటో ఆతిథ్యం: నగరంలో ఆహార పదార్థాల విక్రయం



ఘుమఘుమలు

- నగరం నలుమూలలకూ ఆటోల్లో పసందైన వంటకాలు తరలింపు
- అందుబాటు ధరల్లో విక్రయాలు
- బ్యాటరీ వాహనాలను అవసరానికి తగినట్లుగా తీర్చిదిద్ది వినియోగం
- మహిళలు, యువతకు ఉపాధి మార్గం..



శ్రీకాకుళం డెస్క్

సాయంత్రం నాలుగు దాటితే చాలు.. ఘుమఘుమలు వెదజల్లుతూ మూడు చక్రాల వాహనాలు నగరం నలువైపులకు బయల్దేరతాయి. కొన్నైతే హైవేపై ప్రయాణించి సమీపంలోని కూడళ్లకు చేరుకుంటాయి. పప్పు బూరెలు, కుడుం బూరెలు, కొబ్బరి బూరెలు, నాలుగైదు రకాల రైస్ ఐటెమ్స్, పెరుగు వడ, జున్ను, పులిహోర వంటి వంటకాలే మెనూలో చోటు దక్కించుకున్నాయి. రాత్రి తొమ్మిదిన్నర వరకు భోజన ప్రియుల ఆకలి తీర్చి మళ్లీ ఇంటి బాట పడుతున్నారు విక్రయదారులు. ఈ ఆటో ఆతిథ్యానికి నగరంలో రోజురోజుకీ ఆదరణ పెరుగుతోంది.



నగరంలో ఫుడ్‌ను విక్రయించే ఆటోలు	18 వరకు
నగరంలో వంటశాలలు	3
ప్రత్యక్షంగా ఉపాధి పొందుతున్న మహిళలు	100 మంది

వంటా వార్పు ఎక్కడ..

శ్రీకాకుళం నగరంలో ప్రధానంగా మూడు ప్రాంతాల్లో వంటకాల తయారీ కేంద్రాలున్నాయి. హౌసింగ్ బోర్డు కాలనీ, మారుతీ థియేటర్, జిల్లా పరిషత్ సమీపంలో ఉదయం 9 గంటల నుంచి వంటకాల తయారీ ప్రారంభమవుతుంది. మూడు కేంద్రాల్లోనూ సుమారు 100 మంది వరకు మహిళలు ఉపాధి పొందుతున్నారు. వీరిలో ఒంటరి మహిళలు.. కుటుంబం భారం మోసే వారేకే అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

అందరూ పాకశాస్త్ర ప్రవీణులే..

సంప్రదాయ వంటలు తయారు చేయడం అందరివల్లా కాదు. పలిహోరా, బొబ్బట్లు, బూరెలు, వడలు లాంటివి చేయాలంటే మాత్రం ప్రావీణ్యం తప్పనిసరి. ఇక్కడ వంటశాలల్లో ఉండే మహిళల్లో అధికశాతం గరిటె తిప్పి అద్భుతమైన రుచితో వంటకాలను సిద్ధం చేయడంలో సిద్ధహస్తులు. వీరు తయారు చేసే వంటలను బట్టే వీరికి వేతనం ఉంటుందని చెబుతున్నారు వ్యాపారులు.








నోరూరించే మెనూ ..

సాంబార్ వడ, పెరుగు గారె, జున్ను, పులిహోర, కొబ్బరి బూరె, కుడుం బూరె, మష్రూమ్ బిర్యానీ, వెజ్ బిర్యానీ, ఫ్రైడ్‌రైస్,

పర్యావరణ హితంగా..



ఈ విక్రయాలకు వినియోగించే ఆటోలు పూర్తిగా పర్యావరణ హితమైనవి. బ్యాటరీ వాహనాలనే ఆహారం విక్రయాల కోసం వినియోగిస్తున్నారు. ఓ దుకాణం మాదిరిగా తీర్చిదిద్ది అవసరమైన లైటింగ్, వాటర్ ట్యాంక్, మైక్రో ఒవెన్ ఇతర సదుపాయాలను అందులో కల్పిస్తున్నారు. రోజువారీ శుభ్రం చేసుకోవాడానికి వీలుగా లోపలి భాగాన్ని పూర్తిగా స్టెయిన్‌లెస్ స్టీల్‌తో రూపొందించారు.

ధరల మాటేమిటి

- రైస్ ఐటెమ్స్ క్వాంటిటీని బట్టి ధరను నిర్ణయించారు. కప్పు బిర్యానీ రూ.30 నుంచి విక్రయిస్తున్నారు.
- సాంబారు వడ, పెరుగు వడ ధర రూ.20
- బాదం జున్ను రూ.30, బెల్లం, పంచదార జున్ను రూ.25కు విక్రయిస్తున్నారు.

ఒక్కో వాహనం రూ.3 లక్షలు

బ్యాటరీ వాహనాన్ని కొనుగోలు చేసి దాన్ని అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడానికి రూ.3 లక్షలు ఖర్చవుతోందని వ్యాపారులు చెబుతున్నారు.7 గంటలు చార్జింగ్ చేస్తే 4 గంటలు పాటు ఉంటుందని చెబుతున్నారు. ఫుడ్ బిజినెస్ కావడంతో పర్యావరణ హితమైన వాహనాలకు ప్రాధాన్యమిచ్చామని చెబుతున్నారు.

వెరీ టేస్టీ..



ఆటో ఆతిథ్యం చాలా బాగా నచ్చింది. బూరెలు చాలా ఇష్టం. వీలుచిక్కినప్పుడల్లా తినేందుకు ఆసక్తి చూపుతా. బిర్యానీలు కూడా బాగుంటాయి.

– జ్యోతి ప్రసాద్, చిన్నబజారు

సాంబారు వడ ఇష్టం..



రోజు సాయంత్రం సాంబారు వడ తినేందుకు వస్తుంటాను. పొగలు కక్కే సాంబారులో చక్కని వడ తింటే ఆ అనుభూతే వేరు.

– రాజు, కలెక్టర్ ఆఫీసు రోడ్

శాకంబరీదేవిగా కొత్తమ్మతల్లి



ఆషాఢమాస ఉత్సవాల సందర్భంగా కోటబొమ్మాళిలో కొత్తమ్మతల్లి అమ్మవారిని పలు రకాల కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. గురువారం అమ్మవారు శాకంబరీదేవిగా భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఈఓ వాచకచర్ల రాధాకృష్ణ తెలిపారు. – కోటబొమ్మాళి

జగన్నాథునికి 56 పిండివంటలతో నైవేద్యం



శ్రీకాకుళం నగరంలోని మొండేటి వీధిలో షిరిడీసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రథయాత్ర బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా స్వామివారిని శేషపాన్పు అవతారంలో అలంకరించి 56 రకాల పిండివంటలతో నైవేద్యాలు సమర్పించారు.

– శ్రీకాకుళం కల్చరల్

ఈట్‌రైట్ స్టేషన్‌గా ‘శ్రీకాకుళం రోడ్డు’

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) రైల్వేస్టేషన్‌కు ఈట్‌రైట్ స్టేషన్‌గా గుర్తింపు లభించిందని స్టేషన్ మాస్టర్ ఎం.రవి బుధవారం తెలిపారు. మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ సంస్థ ప్రతినిధులు గతంలో రైల్వేస్టేషన్‌ను సందర్శించి హైజినిక్ ఫుడ్, వాడుతున్న పరికరాలు, ఫ్యాన్లు, ఇతర సౌకర్యాలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారని చెప్పారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండటంతో గుర్తింపు నిచ్చారని పేర్కొన్నారు. మూడు నెలల క్రితం విశాఖ రైల్వేస్టేషన్‌కు ఈ గుర్తింపు రాగా, తాజాగా శ్రీకాకుళం రోడ్, విజయనగరం స్టేషన్‌లకు గుర్తింపు లభించిందని తెలిపారు.



● ఆనందాల అమ్మఒడి

1,91,689 మందికి రూ.287.53 కోట్లు



లబ్ధిదారులకు చెక్ అందజేస్తున్న శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

- జగనన్న అమ్మ ఒడి విద్యార్థులకు వరం
- సీఎం జగన్ చిరస్థాయిగా నిలిచిపోతారు: స్పీకర్ తమ్మినేని



హాజరైన అమ్మఒడి లబ్ధిదారులు, విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: పేదరికంతో పిల్లలు చదువుకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో అమ్మఒడి పథకానికి నాంది పలికి దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని రాష్ట్ర శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. జగనన్న అమ్మఒడి పథకం కింద 2022–23 సంవత్సరానికిగాను జిల్లాలో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదువుతున్న 1,91,689 మంది పేద విద్యార్థులకు లబ్ధి చేకూరేలా వారి తల్లులు/సంరక్షకుల బ్యాంకు ఖాతాలకు రూ.287.53 కోట్లు నిధులను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో బాపూజీ కళామందిరం వేదికగా నిర్వహించారు. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌తో కలిసి జ్యోతిప్రజ్వలన చేసిన స్పీకర్ లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడారు. చదువే భావితరాలకు మనమిచ్చే ఆస్తి అని నమ్మి సీఎం జగన్ అమ్మఒడి మొదలుకుని జగనన్న విద్యాకానుక, విద్యాదీవెన, వసతి, దీవెన, గోరుముద్ద, నాడు–నేడు, సీబీఎస్సీ సిలబస్, ఇంగ్లీషు మీడియంలో బోధన, డిజిటల్ క్లాస్ రూమ్‌లు, మూడో తరగతి నుంచే సబ్జెక్ట్ టీచర్ ఉండేలా కీలకమైన నిర్ణయం.. తదితర అద్భుతమైన విద్యా సంస్కరణలకు శ్రీకారం చుట్టారని వివరించారు.

● కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి, పోటీని పెంచేలా జగనన్న ఆణిముత్యాలు పేరిట టెన్త్ టాపర్లను ఇటీవలి ఘనంగా సత్కరించి నగదు బహుమతులు, మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేసినట్లు తెలిపారు. డీఈఓ డాక్టర్ తిరుమల చైతన్య మాట్లాడుతూ జిల్లాలో విద్యారంగం సాధించిన అభివృద్ధి, విద్యార్థులు, ఉపాధ్యాయుల ప్రగతిని వివరించారు. అనంతరం స్పీకర్, కలెక్టర్ లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేశారు. అంతకుముందు నృత్యశిక్షకులు నీరజ సుబ్రహ్మణ్యం శిష్యబృందం చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్, ఇంటర్మీడియెట్ విద్య డీవీఈఓ కోట ప్రకాశరావు, ఆర్ఐఓ ప్రగాడ దుర్గారావు, ఉప విద్యా శాఖాధికారి గార పగడాలమ్మ, అసిస్టెంట్ కమిషనర్ లియాఖత్ అలీఖాన్, ఎంఈవో కృష్ణారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగనన్న మేలు మరువలేం..



సీఎం జగనన్న మేలు మరువలేం. పేద కుటుంబాలకు ఆర్థికంగా బాసటగా నిలుస్తున్నారు. ఇప్పటికే అనేక పథకాలతోపాటు అమ్మఒడి వరుసగా నాలుగో ఏడాది అందుకుంటున్నాం. గుజరాతీపేటలోని వరం మున్సిపల్ హైస్కూల్‌లో మా ఇద్దరు పిల్లలు చదువుతున్నారు. బాబు జల్లేపల్లి సాయిగౌతమ్ ఇటీవలి టెన్త్‌క్లాస్‌లో 570 మార్కులతో స్కూల్ టాపర్‌గా నిలవడం గర్వకారణంగా ఉంది. పాప అదే స్కూల్‌లో 6వ తరగతి చదువుతోంది.

– జల్లేపల్లి గౌరి, జగనన్న అమ్మఒడి లబ్ధిదారు

జగన్‌మామకు రుణపడ్డాం..



సీఎం జగన్ మామకు మేము ఎంతో రుణపడి ఉంటాం. మా కోసం ఎన్నెన్నో కార్యక్రమాలను చేస్తున్నారు. సంక్షేమ పథకాలను అందిస్తున్నారు. జగనన్న అమ్మఒడి, విద్యాకానుక, గోరుముద్ద, రాగిజావ, నాడు–నేడుతో పాఠశాలకు కొత్త కళను తీసుకొచ్చారు.

– కొట్టిన నందిని, టెన్త్‌క్లాస్, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల శ్రీకాకుళం

అనుమానం.. అమానుషం

- కన్న కొడుకునే హత్య చేసిన తండ్రి
- గాయాలతో బయటపడిన మరో కుమారుడు
- కుప్పిలిలో దారుణం



నిందితుడు కుప్పయ్య

ఎచ్చెర్ల క్యాంపస్: అతనికి 54 ఏళ్లు. తన 50 ఏళ్ల భార్యపై అనుమానం పెంచుకున్నాడు. ఇంకేముంది ఎప్పుడు చూసినా గొడవలే. దీనికితోడు ఇద్దరు కుమారులు కూడా తల్లి పక్షానే ఉండటంతో మరింత కక్ష పెంచుకున్నాడు. అందరినీ చంపేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో కత్తితో దాడికి దిగడంతో పెద్ద కుమారుడు ప్రాణాలు కోల్పోగా, చిన్న కుమారుడు గాయాలతో బయటపడ్డాడు. ఈ ఘటన ఎచ్చెర్ల మండలం కుప్పిలిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..

కుప్పిలి గ్రామానికి చెందిన కొంగ్రు కుప్పయ్య, హరమ్మలు భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె అప్పాయమ్మకు ఇదే గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహమైంది. వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్న కుప్పయ్య భార్యపై అనుమానం పెంచుకున్నాడు. తరచూ ఇంట్లో గొడవ పడేవాడు. తల్లిని నిలదీయాలంటూ పిల్లలతో సైతం గొడవకు దిగేవాడు. తండ్రి వ్యవహార శైలిని పిల్లలు తప్పుపట్టేవారు. కుటుంబం మొత్తం తల్లికే అనుకూలంగా మాట్లాడటంతో కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో మంగళవారం భార్య హరమ్మ, పెద్దకుమారుడు తాతారావు (27), చిన్నకుమారుడు కామరాజు, చిన్నకుమార్తె ఈశ్వరమ్మ ఇంట్లో నిద్రపోతుండగా రాత్రి 11 గంటలు దాటాక కుప్పయ్య దాడికి దిగాడు. సరుగుడు, నీలగిరి తోటలు నరికే కత్తితో పెద్ద కొడుకు తాతారావును నిర్దాక్షిణ్యంగా నరికాడు. తలపై కత్తితో పలుమార్లు దాడిచేయటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు భయాందోళనతో కేకలు వేశారు. పెద్దకొడుకును నరికిన కత్తితోనే చిన్న కొడుకు కామరాజుపైనా దాడిచేశాడు. వెంటనే అప్రమత్తమై పరుగులు తీయటంతో గాయాలతో బయటపడ్డాడు. భార్య హరమ్మ, కుమార్తె ఈశ్వరమ్మ బయటకు వచ్చి కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు మేల్కొనడంతో కుప్పయ్య పరారయ్యాడు. అనంతరం స్థానికులు 108 అంబులెన్సు, పోలీసులకు సమాచారం అందించారు. సీఐ ఆదాం, ఎస్సై సత్యనారాయణ గ్రామానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. క్షతగాత్రుడు కామరాజును శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించి చికిత్స చేయించారు. తాతారావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. గ్రామంలో పోలీస్ పికెట్ నిర్వహించి శాంతిభద్రతలు పర్యవేక్షిస్తున్నారు.



సంఘటన స్థలంలో తాతారావు మృతదేహం (ఇన్‌సెట్లో) తాతారావు (ఫైల్)



గాయపడ్డ కామరాజు

క్విజ్ పోటీల విజేతలకు అభినందనలు

పాతపట్నం/శ్రీకాకుళం పాతబస్టాండ్: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఆర్థిక సమ్మిళిత అభివృద్ధి విభాగం, అఖిల భారత స్కూల్ క్విజ్ జిల్లాస్థాయి పోటీలు బుధవారం శ్రీకాకుళంలో నిర్వహించారు. ఇందులో పాతపట్నం మండలం కొరసవాడ హైస్కూల్ విద్యార్థినులు బెవర మానస, అమర ప్రత్యూషలు ప్రథమ(రూ.10 వేలు), కవిటి మండలం బొరివంక జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఆర్.శ్రీకర్, ఎస్.ఉదయ్ ద్వితీయ(రూ.7500), శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.యశ్వంత్, కె.కృష్ణచైతన్య తృతీయ(రూ.5000) స్థానాలు సాధించారు. వీరిని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అభినందించారు. కార్యక్రమంలో డీఈఓ తిరుమల చైతన్య, హెచ్ఎం బి.సింహాచలం, ఉపాధ్యాయుడు బి.అనిల్‌కుమార్, ఎల్‌డీఎం ఎం.సూర్యకిరణ్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.



విజేతలను అభినందిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

క్లుప్తంగా

ఉజ్వల భవిష్యత్తే లక్ష్యంగా ముందుకు సాగాలి



మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ శాంతి

ఎచ్చెర్ల క్యాంపస్: ఉజ్వల భవిష్యత్తే లక్ష్యంగా విద్యార్థులు ముందుకు సాగాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉమ్మడి శాంతి అన్నారు. తెలుగు విభాగంలో రెండో ఏడాది పీజీ విద్యార్థుల వీడ్కోలు వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పీజీ పూర్తి చేసిన విద్యార్థులు శ్రమించి ఉన్నత లక్ష్యాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తెలుగు బోధన సిబ్బంది పాల్గొన్నారు.

త్రయాంబికకు గ్రాడ్యుయేషన్ పట్టా ప్రదానం



లండన్‌లో ఎమ్మెల్యే రెడ్డి శాంతి కుటుంబ సభ్యులు

ఎల్.ఎన్.పేట: పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి కుమార్తె త్రయాంబిక ప్రియాంకరి లండన్‌లోని లీ కార్డన్ బ్లూ విశ్వ విద్యాలయంలో కుల్నరీ ఆర్ట్ విభాగంలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్నారు. విశ్వ విద్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆమెకు పట్టాను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తల్లి శాంతి, సోదరి వేదిత (ఐఏఎస్)తోపాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం తాగవద్దన్నందుకు..

- వ్యక్తి బలవన్మరణం



మధుబాబు మృతదేహం

శ్రీకాకుళం క్రైమ్: కుటుంబ పోషణ కష్టంగా ఉందని.. మద్యం తాగొద్దని భార్య అన్నందుకు మనస్తాపంతో భర్త విషం తాగి ప్రాణాలు తీసుకున్నాడు. ఈ ఘటనకు సంబంధించి రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పప్పల శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బూబమ్మనగర్ బలగ మెట్టులో శాసనపురి మధుబాబు (52) భార్య కల్యాణి, ఇద్దరు కుమారులతో నివసిస్తున్నారు. కుమారులిద్దరూ ఉద్యోగ రీత్యా బయట ఉన్నారు. మధుబాబు తినుబండారాల లైన్ వ్యాపారం చేస్తుండేవాడు. ఆయనకు మద్యం తాగే అలవాటు ఉండటంతో భార్య తాగవద్దని నచ్చజెప్పేది. ఈ నెల 27న మధ్యాహ్నం కూడా మధుబాబు తాగి రావడంతో కల్యాణి మందలించింది. దీంతో బయటకు వెళ్లిపోయిన మధుబాబు రాత్రి ఎనిమిదిన్నర గంటల సమయంలో మద్యం మత్తులోనే ఇంటికి వచ్చాడు. అయినా ఏమీ అనకుండా టిఫిన్ పెట్టడంతో తినేసి హాలులో పడుకున్నాడు. రాత్రి రెండు గంటల సమయంలో వాష్‌రూమ్‌కని భార్య లేచిచూసేసరికి నురగ కక్కుతూ భర్త కనిపించడంతో ఆందోళనకు గురైన ఆమె బంధువుల సాయంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మధుబాబు చనిపోయినట్లు సీఐ చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

11 కిలోల గంజాయి స్వాధీనం!

ఆమదాలవలస: ఆమదాలవలస రైల్వేస్టేషన్ సమీపంలో వన్ వే జంక్షన్ వద్ద సుమారు 11 కిలోల గంజాయితో ముగ్గురు కేరళ యువకులు పోలీసులకు పట్టుబడినట్లు తెలిసింది. మంగళవారం అర్ధరాత్రి ఆమదాలవలస ఇన్‌చార్జ్ ఎస్ఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో సోదాలు జరుపుతుండగా వీరు పట్టుబడగా స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. కాగా, బుధవారం ఆమదాలవలస ఎస్సై-3 రఘునాథరావు ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ కూడలి వద్ద నిందితులతో సీన్ క్రియేట్ చేశారు. పూర్తి వివరాలు తర్వాత వెల్లడిస్తామని సీఐ పైడయ్య తెలిపారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	58,960-00
బంగారం(22సి. 10గ్రా.)	54,050-00
వెండి (కిలో)	75,700-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 550.00
విజయనగరం	రూ. 554.00
శ్రీకాకుళం	రూ. 554.00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹135	₹240	₹ 250

స్టీరింగ్ పట్టు.. ఉపాధి కొట్టు..



యంత్ర విడిభాగాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

- నిరుద్యోగ యువతకు అండగా ఏపీఎస్ ఆర్టీసీ
- డ్రైవింగ్‌లో శిక్షణ ఇస్తున్న వైనం
- ఇప్పటికే 12 బ్యాచ్‌లు పూర్తి
- శిక్షణ తీసుకుని ఉపాధి పొందుతున్న యువత

శ్రీకాకుళం అర్బన్: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ ఆర్టీసీ) అంటే ముందుగా గుర్తుకు వచ్చేది సురక్షిత, సుఖవంతమైన ప్రయాణం. ప్రయాణికుల సేవలోనే కాకుండా నిరుద్యోగ యువత బంగారు భవిష్యత్తుకు భరోసా కల్పించే విధంగా ఆసక్తి ఉన్న వారికి హెవీ వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణ ఇస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు సంస్థ అధికారులు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలోని వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువత భవిష్యత్తుకు భరోసా కల్పించేందుకు డ్రైవింగ్ స్కూళ్లను ఏర్పాటు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పార్లమెంటరీ నియోజకవర్గాల్లో ఆర్టీసీ హెవీ వెహికల్‌లో డ్రైవింగ్ పాఠశాలలను ప్రారంభించింది. ఇందులో భాగంగా జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం ఒకటో డిపో పరిధిలో హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ స్కూల్‌ను ప్రారంభించారు. అర్హత కలిగిన యువతీ, యువకులకు బ్యాచ్‌లను ఏర్పాటు చేసి డ్రైవింగ్‌లో శిక్షణ, వాహన చట్టం గురించి అవగాహన కల్పించడంలో 32 రోజుల పాటు శిక్షణ ఇస్తున్నారు. దీని కోసం నామమాత్రపు ఫీజును తీసుకుంటారు. శిక్షణ పూర్తి చేసుకున్నవారికి సర్టిఫికెట్‌తో పాటు హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్‌ను ఇప్పించి వారి జీవితానికి భరోసా కల్పిస్తున్నారు. ఇక్కడ డ్రైవింగ్ నేర్చుకుంటున్న అభ్యర్థులు భవిష్యత్తులో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో డ్రైవర్‌గా స్థిరపడేందుకు అవకాశం ఉంటుంది. ప్రభుత్వ రంగాల్లో అయితే ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పొందిన వారికి ప్రాధాన్యం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో ఇల్లా..

జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం ఒకటో డిపో పరిధిలో 2020 అక్టోబర్ ఎనిమిదో తేదీన డ్రైవింగ్ శిక్షణ స్కూల్‌ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ 12 బ్యాచ్‌ల్లో 200 మంది శిక్షణ పొందారు. సమాజంలో నిరుద్యోగ యువత భవిష్యత్తుకు భరోసా కల్పించడం, డ్రైవింగ్‌లో మెలకువలు నేర్పి సమాజానికి అందించడమే శిక్షణ ముఖ్య ఉద్దేశమని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఈ నెలాఖరునాటికి 13వ బ్యాచ్ శిక్షణ సైతం ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే శిక్షణ పొందిన వారిలో చాలామంది డ్రైవింగ్‌ను వృత్తిగా చేసుకుని స్వయం ఉపాధి పొందుతూ కుటుంబాలకు అండగా ఉంటున్నారు.

క్రమశిక్షణతో కూడిన శిక్షణ



హెవీ వెహికల్ డ్రైవింగ్‌లో అభ్యర్థులకు సుశిక్షితులైన నిపుణులచే శిక్షణ అందిస్తున్నాం. క్రమశిక్షణ, అంకితభావంతో డ్రైవింగ్‌లో మెలకువలు నేర్పిస్తున్నాం. రోజూ శిక్షణ అనంతరం ఒక గంట తరగతి గదిలో డ్రైవింగ్‌పై పాఠాలు, గ్యారేజీలో ఇంజిన్ విడిభాగాలపై అవగాహన కల్పిస్తున్నాం. యోగా, ధ్యానంలో కూడా శిక్షణ ఇస్తున్నాం.

– ఎ.విజయ్‌కుమార్, డీపీటీవో, శ్రీకాకుళం

డ్రైవింగ్‌లో మెలకువలు నేర్చుకున్నా



డ్రైవింగ్‌పై మక్కువతో ఆర్టీసీలో హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ పొందాను. బయట అయితే కేవలం డ్రైవింగ్ మాత్రమే నేర్పుతారు. ఇక్కడ అనుభవం, సుశిక్షితులైన శిక్షకులచే చాలా మెలకువలు, ప్రమాదాల బారిన పడకుండా ఉండేవిధంగా డ్రైవింగ్ స్కిల్స్ నేర్పారు.

–డాక్టర్ నాగార్జున, జేమ్స్ మెడికల్ కళాశాల వైద్యుడు

పూర్తిస్థాయిలో అవగాహన



ఆర్టీసీలో ఇచ్చే డ్రైవింగ్ శిక్షణ చాలా బాగుంది. డ్రైవింగ్‌లో మెలకువలతో పాటు బస్సు యంత్రాల విడిభాగాలు చూపడం, ఏవిధంగా డ్రైవింగ్ చేస్తే ఇంధనం ఆదా అవుతుంది, ఎటువంటి సమయాల్లో క్లచ్, బ్రేక్‌లను వినియోగించాలి తదితర వాటిపై క్షుణ్ణంగా అవగాహన కల్పిస్తున్నారు. హెవీ వెహికల్ లైసెన్స్ కూడా ఇప్పించారు.

–దినేష్, బీటెక్, ఎంబీఏ విద్యార్థి, శ్రీకాకుళం

భరోసానిచ్చింది



ఆర్టీసీ హెవీ వెహికల్ డ్రైవింగ్‌లో ఇచ్చిన శిక్షణ జీవితంలో స్థిరపడతానన్న భరోసాను కల్పించింది. ఇక్కడ డ్రైవింగ్ తీసుకున్న నేను విశాఖపట్టణంలోని దిశ పోలీస్ స్టేషన్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాను. మట్టి, తారు, సిమెంటు, కంకర రోడ్లపై వర్షాకాలంలో ఏవిధంగా డ్రైవింగ్ చేయాలో క్షుణ్ణంగా నేర్పారు.

– ఎ.జనార్దనరావు, దిశ పోలీస్ స్టేషన్ డ్రైవర్, విశాఖపట్టణం

ఉత్సాహంగా యువ ఉత్సవ్



విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు

- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళం న్యూకాలనీ: భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు–క్రీడలు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు శ్రీకాకుళం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాల సెమినార్ హాల్ వేదికగా బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి యువ ఉత్సవ్–2023 (ఇండియా ఎట్‌దిరేటాఫ్2047) ఉత్సాహంగా సాగింది. విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీకాకుళం పార్లమెంటు సభ్యుడు కింజరాపు రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. దేశానికి యువతే దిక్సూచి అన్నారు. అభిరుచుల ఆశయ సాధన కోసం కృషి చేస్తూ దేశాభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పంచప్రాణాలు (ఐదు సంకల్పాలు) అనుసరించడం ద్వారా 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశాలలో ఒకటిగా నిలుస్తోందన్నారు. నెహ్రూ యువ కేంద్ర జిల్లా యూత్ ఆఫీసర్ కె.వెంకట్ ఉజ్వల్ మాట్లాడుతూ.. యువశక్తి పెంపుదలలో భాగంగా యువ ఉత్సవ్–2023 పేరిట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. బానిసత్వం, వలసవాద మనస్తత్వాలను తొలగించడం, వారసత్వం, ఐక్యత, సంఘీభావం ఇలా పౌరులలో కర్తవ్యభావం పెంపొందించేందుకు జిల్లా స్థాయిలో డిబేట్, యువ కళాకారులు, రచయితలు ఫొటోగ్రఫీ, సాంస్కృతిక, సంప్రదాయక వారసత్వ ప్రదర్శనలు, అంశాల వారీగా పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు, ప్రసంశాపత్రం అందజేయడంతోపాటు రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీరాములు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో సెట్‌శ్రీ సీఈవో బీవీ ప్రసాదరావు, మెప్మా పీడీ ఎం.కిరణ్ కుమార్, జిల్లా పర్యాటక అధికారి ఎస్.నారాయణరావు ఎన్‌వైకే ఏవో డి.శ్రీనివాస్, గాయత్రి మహిళా మండలి అధ్యక్షురాలు శవ్వాన ఉమామహేశ్వరి, స్పందన వలంటరీ ఆర్గనైజషన్ అధ్యక్షులు పంచిరెడ్డి కృష్ణారావు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

నృత్యం పోటీల్లో మెహర్ ప్రభాకర్ బృందం, గాయత్రి బృందం, రేణుక బృందం మొదటి స్థానాల్లో నిలిచారు. కవితల విభాగంలో ఉప్పాడ రేష్మ, గురుగుబెల్లి వర్ష, చింటు షర్మిల మొదటి మూడు స్థానాలను దక్కించుకున్నారు. పెయింటింగ్ విభాగంలో పరిగా బైరాగి, డోల మంజు, పతివాడ రేష్మ , ఫొటోగ్రఫీ విభాగంలో ఎ.సాయి ప్రసన్న, బి.జయచంద్రిక, కె.జయచంద్రిక, కె.సూరజ్, వక్తృత్వ పోటీల్లో వి.దేవీప్రసన్న, కె.హరిని, సి.పవన్‌సూర్య విజేతలుగా నిలిచి బహుమతులు అందుకున్నారు. ఐదు విభాగాల్లో మొదటి స్థానాల్లో నిలిచిన విద్యార్థులు, బృందాలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

ఆదిత్యాలయ అభివృద్ధికి రూ. లక్ష విరాళం



అరసవల్లి: విరాళాన్ని చక్రవర్తికి అందజేస్తున్న కృష్ణమూర్తి దంపతులు



పొందూరు: విరాళాన్ని అందజేస్తున్న శ్రీనివాసరావు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణస్వామి వారి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల కోసం స్థానికుడైన మెరైన్ ఇంజినీర్ పప్పు కృష్ణమూర్తి, శోభారాణి దంపతులు రూ. 1,00,116 విరాళంగా ప్రకటించారు. ఆదిత్యున్ని బుధవారం దర్శించుకున్న అనంతరం జూనియర్ అసిస్టెంట్ బి.ఎస్.చక్రవర్తికి విరాళం నగదును అందజేశారు. జూనియర్ అసిస్టెంట్ మాట్లాడుతూ.. దాతలకు ప్రత్యేక పాసులు ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో అర్చకుడు నేతేటి హరిప్రసాద్ శర్మ ఉన్నారు.

నిత్యనారాయణ సేవకు..

పొందూరు: పొందూరు సత్యసాయి సేవా మందిరంలో రోజూ జరుగుతున్న నిత్యనారాయణ సేవకు మందుల శ్రీనివాసరావు, స్వర్ణలు రూ. లక్ష విరాళం ప్రకటించారు. ఈ మొత్తాన్ని సత్యసాయిసేవా సమితి కన్వీనర్ డి.రాధాకృష్ణకు బుధవారం అందజేశారు. శ్రీనివాసరావు తల్లిదండ్రులు రమణ, అమ్మాజమ్మల జ్ఞాపకార్థం విరాళం అందజేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో పెన్నం నానాజీ, గుడ్ల సాయిరాజ్ పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి

- విశాఖ జీఆర్పీ లైన్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటరావు



కాశీబుగ్గ: జీఆర్పీ సిబ్బందితో మాట్లాడుతున్న వెంకటరావు

కాశీబుగ్గ/ఆమదాలవలస: రైళ్లలో గంజాయి అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని విశాఖపట్నం జీఆర్పీ లైన్స్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటరావు చెప్పారు. పలాస, శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) జీఆర్పీ స్టేషన్లను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడారు. రైళ్లలో ఫుట్ బోర్డు ప్రయాణాలు లేకుండా చూడాలన్నారు. ప్రయాణికులు కూడా తెలియని వ్యక్తులు ఇచ్చే తినుబండారాలు, ఆహారాన్ని తీసుకోవద్దని సూచించారు. మత్తు పదార్థాలు, గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టిసారించాలని సిబ్బందికి సూచించారు. లోకల్ పోలీస్, ఆర్పీఎఫ్ సిబ్బందితో సమన్వయం చేస్తూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరించాలన్నారు. పలాస స్టేషన్ ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతమైనందున ఒడిశా నుంచి వచ్చిపోవు రైళ్లలో ప్రత్యేక స్క్వాడ్ టీం పెట్టి రాత్రిపూట గస్తీ పెంచాలన్నారు. ఆమదాలవలస స్టేషన్‌లో దస్త్రాలను పరిశీలించారు. పలు నేరాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో పలాస జీఆర్పీ ఎస్సై షరీఫ్, ఏఎస్సైలు, హెచ్‌సీలు, హోంగార్డులు ఉన్నారు.

రిమ్స్ ఆర్‌ఎంవో దురుసు ప్రవర్తన!

- ప్రధాన గేటు వద్ద విలేకరులను అడ్డగించిన వైనం
- ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి రావాలని స్పీకర్ నుంచి పిలుపు
- సెల్ స్విచ్చాఫ్ చేసిన ఆర్‌ఎంవో



తొడగొడుతున్న ఆర్‌ఎంవో శంకరరావు

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రి ఆర్‌ఎంవో డాక్టర్ శంకరరావు వివాదాలకు నిలయంగా మారుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. పారిశుద్ధ్య కార్మికల ధర్నా, జిల్లా అధికారుల ఫిర్యాదు, స్టాఫ్ నర్సు ఆస్పత్రి సలహామండలి చైర్మన్‌కు ఫిర్యాదు చేయడం ఆర్‌ఎంవో దురుసు ప్రవర్తనకు నిదర్శనంగా ఉన్నాయి. ఇన్ని జరిగినా తీరు మార్చుకోని ఆయన తాజాగా బుధవారం కూడా విలేకరులపై దురుసుగా ప్రవర్తించడంతోపాటు స్పీకర్ తమ్మినేని సీతారాం ఆదేశాలను ధిక్కరించి వార్తల్లో నిలిచారు. వివరాలలోకి వెళితే.. ఎచ్చెర్ల మండలం కుప్పిలి గ్రామంలో జరిగిన యువకుడి హత్యతోపాటు ఘటనలో గాయపడిన వారంతా రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. దీంతో సంఘటనను కవర్ చేసేందుకు పలువురు మీడియా ప్రతినిధులు బుధవారం ఉదయం రిమ్స్ వద్దకు చేరుకున్నారు. ఆ సమయంలో ప్రధాన ద్వారం వద్ద ఉన్న ఆర్‌ఎంవో తాను ఇక్కడ పనిచేస్తున్నంత వరకు విలేకరులకు లోపలికి వచ్చేందుకు అనుమతి లేదన్నారు. దీనిపై విలేకరులు ప్రశ్నిస్తుండగా మీడియా ప్రతినిధులను, జిల్లా వాసులను పరుష పదాలతో దూషించి ఒక మీడియా ప్రతినిధిని మెడపట్టుకొని గెంటేశారు. ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బందిని రప్పించి వారి ద్వారా విలేకరులను నెట్టి వేయాలని ఆదేశించారు. ఈ తరుణంలో విలేకరులు రెండో పట్టణ పోలీసులకు సమాచారం అందించగా, వారు రిమ్స్‌కు చేరుకున్న తరువాత మరింతగా రెచ్చిపోయి ఆర్‌ఎంవో శంకరరావు తొడకొట్టారు. వారించేందుకు ప్రయత్నించిన ఎస్సైను కూడా తోసేశారు. మీడియా ప్రతినిధులు కొద్దిసేపు ధర్నా చేసి రెండో పట్టణ పోలీసులకు ఆర్‌ఎంవోపై ఫిర్యాదు చేశారు. అటు తరువాత నగరంలోనే ఉన్న స్పీకర్ తమ్మినేని సీతారాంకు కూడా విలేకరులు ఫిర్యాదు చేశారు. ఆర్‌ఎంవో ప్రవర్తించిన తీరుకు సాక్ష్యంగా వీడియోను చూపించారు. దీనిపై స్పందించిన ఆయన ఆర్‌ఎంవోకు ఫోన్‌చేసి ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి రావాలని ఆదేశించారు. మధ్యాహ్నం 3.30 గంటల వరకు రాకపోడంతో ఆర్‌ఎంవోకు మరోసారి ఫోన్ చేయగా ఆయన స్విచ్చాఫ్ చేసినట్టు తెలిసింది. దీంతో ఆగ్రహం చెందిన స్పీకర్ రాష్ట్ర అధికారులకు ఫోన్ చేసి ఆర్‌ఎంవోను సరెండర్ చేస్తున్నానని.. ఆయనపై చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి శంకరరావును సరెండర్ చేయాలని ఆదేశించారు. మీడియా ప్రతినిధులు జిల్లా కలెక్టర్‌కు కూడా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

గాయపడిన వ్యక్తి మృతి

ఎల్.ఎన్.పేట: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. రావిచెంద్రి గ్రామానికి చెందిన పాదిలాపు భాస్కరరావు (60) ఈ నెల 25వ తేదీన ద్విచక్ర వాహనంపై వెళ్తూ అదుపుతప్పి పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. జెమ్స్‌కి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయినట్టు చెప్పారు.

పట్టపగలే దొంగలు పడ్డారు

- ఫరీదుపేట కూడలిలో చోరీ
- 13 తులాల బంగారం, రూ. 1.60 లక్షల నగదు అపహరణ



చోరీ జరిగిన బీరువాను పరిశీలిస్తున్న క్లూస్ టీం

ఎచ్చెర్ల క్యాంపస్: పట్టపగలే ఓ ఇంట్లోకి దొంగలు చొరబడి నగలు, నగదు అపహరించుకుపోయారు. ఈ సంఘటన 16వ నంబరు జాతీయ రహదారి పక్కన ఫరీదుపేట పంచాయతీ కొయ్యరాళ్ల కూడలిలో బుధవారం ఉదయం చోటుకుంది. దుర్గాలయం సమీపంలో ఉంటున్న చోడవరం నారాయణరావు మేడపై ఇంట్లో దొంగలు పడ్డారు. ప్రస్తుతం ఈ ఇంట్లో దంపతులైన నారాయణరావు, లక్ష్మి మాత్రమే ఉంటున్నారు. లక్ష్మి ఉదయం ఏడు గంటల సమయంలో నాతన్న చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులకు వెళ్లిపోగా.. నారాయణరావు ఎనిమిది గంటలకు ఇంటికి తాళం వేసి తను పనిచేస్తున్న కుశాలపురం నవభారత్‌లోని అల్యూమినియం పరిశ్రమకు వెళ్లిపోయారు. తిరిగి 9.30 గంటల సమయంలో అల్పాహారం చేసేందుకు నారాయణరావు ఇంటికి వచ్చి చూడగా తలుపు గడియలు పగల గొట్టి ఉండడంతో ఆందోళన చెందాడు. లోనికి వెళ్లి చూడగా రెండు బీరువాల్లోని దుస్తులన్నీ బయట పడేసి ఉన్నాయి. లాకర్‌లో ఉంచిన 13 తులాల బంగారం (గాజులు, నల్లపూసలు, గొలుసు), రూ. 1.60 లక్షల నగదు చోరీకి గురైనట్టు గుర్తించారు. వెంటనే ఎచ్చెర్ల పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. సీఐ ఆదం ఆధ్వర్యంలోని పోలీసులు, క్లూస్‌టీం సంఘటన స్థలానికి చేరుకుని క్షుణ్ణంగా పరిశీలించారు. పగల గొట్టిన గడియలు, బీరువా పరిశీలించిన క్లూస్‌టీం ప్రాథమిక ఆధారాలు సేకరించారు. దొంగతనంలో స్థానికుల ప్రమేయం ఏమైనా ఉందా.. లేక ఇతర ముఠాల పనా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా నారాయణరావు దంపతులు ఇటీవల వారం రోజులు తిరుపతి వెళ్లి వచ్చారు. ఆ సమయంలో ఎటువంటి సమస్య రాలేదు. అలాంటిది తాళం వేసి ఉన్న గంటన్నరలోపే చోరీ జరగడంతో బాధితులు విలపిస్తున్నారు.

దాడి కేసులో ఐదుగురు అరెస్టు

పోలాకి: గుప్పెడుపేట గ్రామానికి చెందిన నందుపల్లి ధనరాజ్‌పై ఈనెల 22వ తేదీన దాడి జరిగింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం అంపోలు జిల్లా జైలుకు తరలించినట్టు పోలాకి ఎస్ఐ వి.సత్యన్నారాయణ బుధవారం తెలిపారు.

ఎర్రచందనం కేసులో వ్యక్తి అరెస్టు

టెక్కలి రూరల్: ఎర్ర చందనం అక్రమ రవాణా కేసులో ఒకరిని అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. గత ఏడాది సెప్టెంబర్ ఆరో తేదీన బొప్పాయిపురం సమీపంలో ఎర్రచందనం తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అప్పట్లో 11 మందిని అరెస్టు చేశారు. మరో వ్యక్తి ఉన్నాడనే సమాచారంతో పోలీసులు గాలిస్తూనే ఉన్నారు. చివరకు ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా గండాహాతికి చెందిన గణేష్ పండాని బుధవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్టు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

12 నుంచి పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ ఎన్నికలు

- నోటిఫికేషన్ విడుదల

అరసవల్లి: ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ ఎన్నికలను వచ్చే నెల 12 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈమేరకు ఎన్నికల నోటిఫికేషన్‌ను జెడ్పీ ఆవరణలో విడుదల చేసినట్లుగా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కిల్లారి నారాయణరావు, ప్రధాన కార్యదర్శి బి.వి.ఆర్.ప్రసాదరావులు సంయుక్తంగా బుధవారం తెలిపారు. జిల్లాలో మినిస్టీరియల్ సంఘం, పాత సమితులు, జెడ్పీ యూనిట్ సభ్యుల పదవీకాలం ఈ ఏడాది జనవరి 19వతోనే ముగిసింది. అయితే అనివార్య కారణాలతో ఎన్నికల నోటిఫికేషన్ వాయిదా పడిందని, తాజా షెడ్యూల్ ప్రకారం ఎన్నికల ప్రక్రియను నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లుగా వివరించారు. రాష్ట్ర శాఖ అనుమతితో ప్రస్తుతం ఉన్న సభ్యులే వచ్చే నెల 19 వరకు అడహక్ కమిటీ సభ్యులుగా కొనసాగనున్నారన్నారు. సంఘం, ఎన్నికల బైలాస్ ప్రకారం నోటిఫికేషన్ నిబంధనలు అమల్లోకి రానున్నాయని, తాలూకాల వారీగా ఈ ఎన్నికలు జరుగుతాయని, ఇందుకోసం ఎన్నికల అధికారులను నియమించామన్నారు.

ఎన్నికల షెడ్యూల్ ఇలా..

- జూలై 12న ఉదయం 10.30 గంటల నుంచి ఇచ్ఛాపురం తాలూకా (ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి), మధ్యాహ్నం 12 గంటల నుంచి మందస తాలూకా (మందస, సోంపేట)
- 13న ఉదయం పలాస తాలూకా (పలాస, వజ్రపుకొత్తూరు), మధ్యాహ్నం టెక్కలి తాలూకా (టెక్కలి, నందిగాం)
- 14న ఉదయం కోటబొమ్మాళి తాలూకా (కోటబొమ్మాళి, సంతబొమ్మాళి), మధ్యాహ్నం నరసన్నపేట తాలూకా (నరసన్నపేట,పోలాకి, జలుమూరు)
- 15న ఉదయం పాలకొండ తాలూకా (పాలకొండ, ఆర్.ఆమదాలవలస), మధ్యాహ్నం రాజాం తాలూకా (రాజాం, సంతకవిటి), వీరఘట్టం తాలూకా (వీరఘట్టం, వంగర)
- 17న ఉదయం సీతంపేట, మధ్యాహ్నం కొత్తూరు తాలూకా (కొత్తూరు, భామిని, హిరమండలం), సారవకోట తాలూకా (సారవకోట, పాతపట్నం, మెళియాపుట్టి)
- 18న ఉదయం ఆమదాలవలస తాలూకా (ఆమదాలవలస, బూర్జ, సరుబుజ్జిలి, ఎల్ఎన్‌పేట), మధ్యాహ్నం గార తాలూకా (శ్రీకాకుళం, గార)
- 19న ఉదయం రణస్థలం తాలూకా (రణస్థలం, లావేరు), మధ్యాహ్నం పొందూరు తాలూకా (ఎచ్చెర్ల, పొందూరు, జి.సిగడాం).
- జిల్లా పరిషత్–శ్రీకాకుళం యూనిట్ కార్యవర్గ ఎన్నికను 19న మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించనున్నామని జిల్లా శాఖ అడహక్ ప్రతినిధులు వివరించారు.